
"నా లుగురోజులు ముందుగా రమ్మంటే"... ముహూర్తం వేళకా రావటం...." నా రెండుచేతుల్నీ పట్టుకుని ఆప్యాయంగా కోప్పడ్డాడు పట్టాభి.

"ముందుగా రావాలనటం... అప్పుడే వెళ్తారా అనటం... ఇవన్నీ ఆనవాయితీగా మాట వరసకేనని అందరికీ తెలిసిన సంగతేగా! ఈ రోజుల్నిబట్టి వేళకివచ్చి... పెళ్ళిఅవగానే వెళ్ళిపోవటమే తెలివిగా ఉంటుంది! నువ్వు పెళ్ళి ఏర్పాట్లు ఇలా చేస్తున్నావని తెలిస్తే మాత్రం తప్పకుండా నాలుగురోజుల ముందే వచ్చేసేవాడిని. ఈ తాటాకుల పందిళ్ళేమిటి... మామిడాకుల, బంతిపూల తోరణాలేమిటి... అలికిన నేలంతా ముగ్గులు... మన చిన్నతనం రోజుల్లో పెళ్ళివారిల్లు ఎలా ఉండేదో మళ్ళీ కళ్ళకు కట్టినట్లుగా చూపించావు కదరా... కొబ్బరాకులు చుట్టిన స్తంభాల చుట్టూ ఆటలాడుతున్న పిల్లల్ని చూస్తుంటే... మనము మళ్ళీ ఆ రోజుల్లోకి వెళ్ళిపోయి... వాళ్ళలా పరుగులు పెట్టాలన్నంత హుషారు నాకు వచ్చేసిందనుకో..." ఆనందంగా అన్నాను.



# పాతపెళ్లి


గోగినేని మణి

నా మాటలకు నవ్వుతూ "ఇప్పుడు మాత్రం ఏమయిందీ... నాలుగు రోజుల తర్వాతే వెళ్ళు. మనం కలుసుకుని కూడా చాలానాళ్ళయింది... ఇద్దరం సరదాగా గడిపినట్లుంటుంది. ఏమంటావ్?" అని మళ్ళీ నవ్వుతూ "మాట వరసకి మాత్రం కాదు.. నిజంగానే చెబుతున్నాను..." అన్నాడు.

"అది నాకు మాత్రం తెలియదా..." అంటూ నేనూ నవ్వాను. "నువ్వు ప్రత్యేకం చెప్పనక్కర్లేదు. ఇష్టమైనన్ని రోజులు ఉండే స్వతంత్రం నాకుంది! కాకపోతే పెళ్ళయి... పెళ్ళికూతురు వెళ్ళాక... సర్దుకునే పనులే తప్ప సందడేం ఉంటుంది! అది సరేగానీ, ఎంత పల్లెటూరులో అయినా షామియానాలే తప్ప పందిరి కనుపించడం లేదు. ఇంతంత పందిళ్ళు వేయించావ్... ఎలా వీలయిందిరా...?" ఆశ్చర్యంగా అడిగాను.

"అమ్మాయి పెళ్ళి అట్టహాసంగా కాదు గానీ... మునుపటి రోజుల్లోలా.... బంధుమిత్రులందరం కలిసి ఓ వారంరోజుల పాటు సరదాగా గడిపేట్లుగా జరగాలని ఉందని తమ్ముళ్ళతో ఓ మాట అన్నానంతే... నా కోరిక తీర్చే బాధ్యత వాళ్ళిద్దరూ తీసేసుకున్నారు. నెలరోజుల ముందే సెల

వుపెట్టేసి వచ్చేశారు. పిల్లలు మాత్రం నాలుగురోజుల క్రిందే వచ్చారనుకో. ఓ వారంరోజుల నుండీ...పెళ్ళి కూతుర్ని చేయటం... అదనీ... ఇదనీ... ఏదో వేడుక పేరు చెప్పి ఊళ్ళో వున్న బంధువులు, పని వాళ్ళు కలిసి రోజుకి వంద విస్తళ్లు లేస్తున్నాయి. ఈ పనులన్నీ తమ్ముళ్ళే చక్కబెడుతున్నారు. నేను మాత్రం పైపైన తిరుగుతున్నానంతే! ఊళ్ళో చుట్టాలందరూ కూడా పనుల్లో తలో చెయ్యి వేస్తున్నారు... సందడేగానీ శ్రమేం లేదు. చుట్టాల అందరిళ్ళవద్దనుండి పాలు, పెరుగు కూరగాయలు వచ్చి పడుతున్నాయి!'' అంటూ అప్పుడే అటుగా వచ్చిన లక్ష్మణ్‌కి నీ వసతి ఏర్పాట్లు చూడమని పురమాయించాడు.



పట్టాభికి, అతని తమ్ముళ్ళు లక్ష్మణ్, భరత్‌కుమార్ లకీ వయసులో పది పన్నెండు సంవత్సరాల తేడా ఉంది. పట్టాభి తమ్ముళ్ళు, పట్టాభి పిల్లలిద్దరూ కూడా నన్ను బాబాయ్ అనే పిలుస్తారు.

లక్ష్మణ్ 'రండి బాబాయ్...'' అని ''మీరూ ఇప్పుడు వచ్చేరేంటి... ముందుగా వస్తారని అనుకున్నాం...'' అడిగాడు.

''ఇప్పుడే మీ అన్నకి పేజీన్నర సమాధానం చెప్పాను. మళ్ళీ చెప్పే ఓపికలేదు గానీ... వాడినడిగి తెలుసుకో...'' సరదాగా అన్నాను.

''అలాగే...'' అంటూ చిరునవ్వుతో ''స్నానం చేసి వచ్చాక భోజనానికి మొదటి బంతిలోనే కూర్చుంటారా... కొంచెం ఆలశ్యంగా చేస్తారా...'' అన్ననడిగి తెలుసుకోవాలా... మీరే చెబుతారా...?'' అడిగాడు.

నేను నవ్వేసి ''కమ్మని వంటల వాసనలు అదరగొట్టేస్తున్నాయి... పెందరాళే భోజనం చేయటం అలవాటు లేకపోయినా, ఇప్పుడు మాత్రం నేను మొదట బంతికే సిద్ధం..'' చెప్పాను.

వంటకాలాన్నీ ఇప్పటి రోజుల్లోని కొత్త వెరైటీలు కాకుండా సంప్రదాయకమైనవే! పులిహోర, ఆవపెట్టిన పనస పొట్టు కూర, గోంగూర పచ్చడి, గుమ్మడికాయ ముక్కల దప్పళం... నా బోటి వాళ్ళకి మాత్రమే జిహ్వా లేచి వచ్చే రకాలు! భోజనాలు వడ్డిస్తున్నది కూడా అందరూ బంధువులే. వరసలలో పలుకరింపులు.. ఏం కావాలో కనుక్కుంటూ ఆప్యాయంగా వడ్డనలు... సరదా సరదా పరిహాసాలు... చాన్నాళ్ళకు నేను సంతృప్తిగా చేసిన పెళ్ళి భోజనం అదే!

మావూళ్లో మాకున్న పొలాల్ని అమ్మేసి నాన్న కర్ణాటక మకాం మార్చెయ్యటంతో నేను ఈ ఊళ్ళో అమ్మమ్మగారింట్లో హైస్కూలు చదువు పూర్తి చేశాను. అప్పట్లో హైస్కూలు మాత్రమే ఉండేది కానీ ఇప్పుడు కాలేజీ వచ్చింది. హైస్కూలు రోజుల్లో పట్టాభితో కుదిరిన స్నేహం ఇప్పటికీ కొనసాగుతోంది. కలుసుకోవటం తరుచూ కుదరకపోయినా గానీ ఫోనులో పలకరింపులు జరుగుతూనే ఉంటాయి!

తండ్రి చనిపోవటంతో పట్టాభి హైస్కూలులో చదువు ఆపేసి వ్యవసాయాన్నీ, కుటుంబ పోషణ భారాన్నీ తన భుజాలకెత్తుకున్నాడు. తల్లి సాయంతో మాత్రమే చిన్నపిల్లలైన తమ్ముళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు చేశాడు. అంతేకాదు... తండ్రి ఇచ్చిన పదెకరాల పొలాన్ని స్వశక్తితో ఇరవై ఎకరాలకు పెంచాడు! పట్టాభి తమ్ముళ్ళిద్దరూ కూడా పెద్ద చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇద్దరుఇద్దరు పిల్లలతో ఆనందంగా ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కు లేకపోయినా... ఎటువంటి ఒడి దుడుకులు లేకుండా అన్నీ సవ్యంగా జరిగిపోయాయంటే... పట్టాభి శ్రమే కారణం! అయినాసరే, ఆస్తిని పంచేటప్పుడు సమభాగాలే చేశాడు! పట్టాభిలాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు.

పెళ్ళిముహూర్తం రాత్రి పదకొండు గంటలకి, భోజనాలు పూర్తయి పోవటంతో అందరూ పందిరి నిండుగా కూర్చున్నారు. మేళం వాళ్ళు ''సీతమ్మ పెళ్ళి

కూతురాయెనే...'' వాయిస్తుండగా పెళ్ళికూతురు వకుళ పెళ్ళి పందిట్లోకి వచ్చింది.

వధూవరులిద్దరూ ముచ్చటగా ఉన్నారు. మేళతాళాల మధ్య పెళ్ళితంతు అంతే ఆనందంగా జరిగిపోయింది. సర్దుకునేవాళ్ళు సర్దుకుంటుంటే పిల్లలూ, పెద్దలూ నిద్రలకు పడ్డారు. దూరం నుండి వచ్చిన బంధువు లందరికీ ఊళ్ళోని పదిమంది ఇళ్ళల్లో వసతి ఏర్పాట్లుచేశారు. కేవలం పట్టాభి ఇంట్లో జరిగే శుభ కార్యమే అనుకోకుండా ఊళ్ళోని బంధువు లందరూ కూడా తమ ఇంట్లోని వేడుకే అన్నట్లుగా అన్నిపనుల్లో పాలుపంచుకున్నారు. ఊళ్లో పట్టాభికున్న పేరు అలాంటిది మరి!

పక్కవసారా గుమ్మం దగ్గిర లక్ష్మణ్, భరత్ ఎవరితోనో గట్టిగా మాట్లాడటం వినిపించి... నేను అటు వేపు అడుగులు వేశాను. అతనెవరో వెళ్ళిపోయాడు. సంగతేమిటన్నట్లుగా చూశాను. ''ఏం లేదు బాబాయ్... చిన్న విషయమే'' భరత్ అన్నాడు.

''వీడు... మా పూరతను కాదు... అందుకే పద్ధతులు తెలీకఏదో మాట్లాడు తున్నాడు. యాభై, వందా అనేది ముఖ్యం కాదు... లెక్క పక్కాగా ఉండాలి! మా ఇద్దరిదీ ఇదే పద్ధతి... అన్నయ్యలా మేం ధారాళం కాదు! ఇంట్లో వాళ్ళదగ్గరైనా అంతే... పది రూపాయలకైనా సరే, లెక్క ఇచ్చి తంగా ఉండాల్సిందే!'' చిరునవ్వుతో లక్ష్మణ్ చెప్పాడు.

అక్కడే నిలబడ్డ లక్ష్మణ్ భార్య గాయత్రితో ''పైసా పైసా లెక్క చెప్పా లంటే... వీడితో నీకు గట్టి చిక్కేక దమ్మా..?'' సరదాగా అన్నాను.

''ఏం చెప్పమంటారు బాబాయ్... అవునంటే అమర్యాద, కాదంటే అసత్యం..'' నిట్టూరుస్తూ అని ఫక్కున నవ్వేసింది.

లక్ష్మణ్ కూడా నవ్వుతూ ''ఎవరేం అనుకున్నా ఫర్లేదు. కష్టపడి సంపాదించే ప్రతీ రూపాయి పట్లా నీకు జాగ్రత్తే'' అన్నాడు.

వీళ్ళిద్దరూ డబ్బు దగ్గర ఇంత జాగ్రత్తపరులు కాబట్టే ఇంత తొందరగా సొంత ఇంటికి యజమానులయ్యారని అనుకున్నాను.

తెల్లారాక ఎనిమిది గంటల వేళప్పుడు మగపెళ్ళివారందరూ పెళ్ళి కూతుర్ని వెంటబెట్టుకుని వాళ్ళు వచ్చిన బస్సులోనే తరలిపోతారు. అందుకని టిఫిను ఏర్పాట్లకు కొందరు వంటవాళ్ళు కబుర్లు చెప్పుకుంటూ పనులు మొదటు పెట్టేశారు.

నీ ప్రయాణం కూడా ఉదయమే కాబట్టి నేనూ, పట్టాభి ఒక గదిలో మంచం మీద పడుకునే కబుర్లు మొదలు పెట్టాం... మళ్ళీ కలుసుకునే అవకాశం ఎన్నాళ్ళకు వస్తుందో మరి!

''నీ సమస్యలు... అదే కోర్టు గొడవలన్నీ తీరినట్లేనా...?'' పట్టాభి ఆరా తీశాడు. నిట్టూర్చాను. ''కనుచూప మేరలో కూడా ఒక కొలిక్కి వచ్చే సూచనలు కనుపించటం లేదు!''

''అదేం..?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''ఏం ఉందీ... ఎవరి వాదనలు వాళ్ళవే! అందరికీ పంతాలే! రాజీ మార్గానికి ఒక్కఅడుగు కూడా వెయ్యరు! కోర్టులోనూ తెగదు... వాయిదాలు పడుతూ సంవత్సరాలు గడిచిపోతున్నాయి!'' చెప్పాను.

నాన్న కర్ణాటకలో కొన్నేళ్ళు వ్యవసాయం చేసి... ఆ తర్వాత కాంట్రాక్టులు మొదలుపెట్టాడు. బెంగుళూరు, కలకత్తా అంటూ తిరిగి చివరకు హైదరాబాద్‌లో సెటిల్ అయ్యాం. నేను ఉద్యోగం మానేసి నాన్నకి చేదోడుగా ఉండిపోయాను. ముగ్గురు తమ్ముళ్ళు తలోచోట ఉద్యోగాలు చేసుకుంటూ బాగానే ఉన్నారు.

కాంట్రాక్టులు చేసి నాన్నబాగానే సంపాదించినా, మధ్యలో ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొన్నారు. అవన్నీ నాకు తెలుసు. బిల్లులు అందక – అప్పులకి వడ్డీలు అనవసరంగా పెరిగి పోతున్నాయనిపించినప్పుడు... శ్రీమతి పుట్టింటి వాళ్ళిచ్చిన డబ్బును పెట్టుబడిగా నాన్నకి ఇచ్చాను. తర్వాత తిరిగి తీసుకున్నాగానీ... సమస్యలొచ్చినప్పుడు ఆదుకోగలిగానని నేను అనుకుంటాను. నాన్న ఉన్నప్పుడే పంపకాలు జరిగినా కానీ.... ఆ తర్వాత అందిన డబ్బుతో చాలా సమస్యలొచ్చాయి. తమకి అన్యాయం జరిగిందంటూ తమ్ముళ్ళు కోర్టుకెక్కారు. మనస్పర్థలు పెరిగి... రాకపోకలు కూడా ఆగిపోయాయి. ఎంత ఆస్తి ఉంటేనేం... తెమలని కోర్టు గొడవలతో... అయిన వాళ్ళ మధ్య సఖ్యత లేక... ప్రశాంతత అన్నదేలేదు!

నేను రాజీ గురించి ఆలోచిద్దామన్నా, పెద్దవాళ్ళయిన పిల్లలూ, శ్రీమతి కూడా ఒప్పుకోరు!

నా మనసు విప్పి పట్టాభికి చెప్పుకున్నాను. ''సమస్యలొచ్చినప్పుడు నాన్నని ఎలా చేస్తున్నారు, ఏమిటి అని అడిగినవాళ్ళు లేరు గానీ... పంపకాల దగ్గర హక్కులంటూ మాట్లాడుతున్నారు! బాధ్యతలు పట్టలేదు గానీ భాగాల దగ్గర మాత్రం పట్టుదలలు! కుటుంబ సమస్యలకి నేను ఆదుకున్న సందర్భాలు ఎవరికీ గుర్తు లేవు! పది రూపాయలు నావి పెట్టుబడిగా ఇచ్చి వంద రూపాయలు తీసుకున్నానని ఆరోపణలే కాకుండా... అలాంటి స్వార్థంతోనే ముందుగా పెట్టుబడి పెట్టానని ఎన్నో మాటలూ అన్నారు! ఒక తమ్ముడైతే 'వారసత్వపు ఆస్తి పంచుకునే సమయం వచ్చే వరకూ ఏ మనిషి స్వభావాన్నీ ఎరుగుదుమని అనుకోవటానికి వీల్లేదని ఎందుకన్నారో ఇప్పుడు తెలిసింది' అని నా మొహం మీదే అన్నాడు! మానవబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని ఎవరో పెద్దాయన చెప్పిన మాటమాత్రం నూటికి నూరుపాళ్ళు నిజం రా...!''

పట్టాభి తల అడ్డంగా వూపాడు.

''కొందరి విషయంలో ఆమాట నిజమైతే అవొచ్చు గానీ... అందరి విషయమూ అంతేనంటే నేనంగీకరించను'' స్థిరంగా అన్నాడు.

అవును మరి... తమ్ముళ్ళు కనుసన్నల్లో ఉండి.. తన మాటకి విలువ ఇస్తున్నారు! ఆ అప్యాయతలు, అభిమానాలు ఎంతవరకూ నిలబడ తాయో... ఏదైనా సమస్య వచ్చినప్పుడు గదా తెలిసేది! వాళ్ళిద్దరూ డబ్బు విషయానికి వస్తే... పట్టాభిలా కాదు... చాలా జాగ్రత్తపరులని తెలిసిపోతోంది! ఎప్పుడో ఒకప్పుడు పట్టాభికి దెబ్బతగలక మానదు! మనసులోనే నిట్టూర్చాను.

''నువ్వు చాలా అమాయకంగా ఆలోచిస్తున్నావురా...'' అన్నాను. ''నువ్వు చదువుమానేసి రాత్రింబవళ్ళు పొలంలో చాకిరీచేసి తమ్ముళ్ళను చదివించావు. నీరెక్కల కష్టంతోనే ఆస్తిని రెట్టింపు చేశావు! వాళ్ళు పెద్ద జీతాలు తెచ్చుకుంటూ ఇళ్ళూ వాకిళ్ళూ కొనుక్కునే స్థితిలో ఉన్నా సరే... ఈ ఆస్తినీ సమానంగా పంచేశావ్! ఇల్లయినా నీ పేరు ఉండాలని వాళ్లే అన్నా నువ్వే ఒప్పుకోలేదు! ఇలా త్యాగాలు చేస్తే... వాళ్ళకేం బాగానే ఉంటారు! ఇలా హక్కుల్ని వదులుకోవటం వలన ప్రయోజనం ఏం ఉండదు... తెలివి తక్కువవాళ్ళలా మిగిలిపోవటం తప్ప!'' ఆవేశంగా అన్నాను.

పట్టాభి చిరునవ్వుతో చూశాడు. ''నువ్వు చాలా పొరబడుతున్నావురా! నాన్న నా మీద పెట్టిన బాధ్యతను నెరవేర్చటంలో త్యాగం ఏముంది చెప్పు...? నాన్న ఇచ్చిన భూమిలోనే నీ కోసం, కుటుంబం కోసం కష్టపడ్డా నంతేగా! తమ్ముళ్ళ చదువుల కోసం డబ్బు పంపించానంటే... నేను పని చేశానేగానీ పొలం మా అందరిదీ కదా! నేను రెట్టింపు చేయగలిగా నంటే... ఆ ఆదాయంతోనేగా....!''

''సరేలే... నువ్వే ఇలా అనుకుంటే సమస్యే ముందీ!'' నిట్టూరుస్తూ అన్నాను.

''నిజమే... మన ఆలోచనా విధానం బట్టే సగం సమస్యలు వస్తాయి! పంతాలతో పెరుగుతాయి! నేను నా బాధ్యతను నిర్వర్తించాను తప్ప తమ్ముళ్ళకేదో చేసే

కవిత



## ఆనందం

ఆనందం క్షణికమే కావచ్చు
కాని ఆక్షణం శాశ్వతం
మస్తిష్కం పొడిబారనంత వరకు
హృదయం తడి ఆరనంత వరకు
అది నిత్యనూతనం
నక్షత్రం రాలిపోయినా
అది ప్రసరించిన కాంతి
అంతరిక్షంలో ప్రయాణిస్తూనే వున్నట్లు
అనుభవాలు వెలిగించిన ఆనందం
మనిషిని అంటిపెట్టుకునే వుంటుంది
అనుభవం ఆగిన చోటునుండే
ఆనందం మొదలుపెడుతుంది
దుఃఖం విశ్రమించిన చోటు నుండే
ఆనందం విస్తరిస్తుంది
ఆహ్వానిస్తే చాలు
అవతరించే అతిధి ఆనందం
రాతి బండ లాంటి గుండెల్ని చీల్చుకుని
ఆనందం మొలకలెత్తగలదు
పులకలెత్తగలదు
పిట్టల కూజితాలపై ఫిరంగుల్ని పేలిస్తే
ముందుగా మరణించేది
మన ఆనందమే!
బోసి నవ్వుల్ని దోసిళ్లతో జుర్రుకుంటే
మహావృక్షమయ్యేది మన ఆనందమే!
ఆనందం ఒక అలకాదు, అలవాటు
పిడికిట్లో వెన్నెల్ని బంధించలేనట్లే
ఆనందాన్ని అలమారాల్లో దాచలేం

–నిశాపతి

శానని అనుకోవటం లేదు కాబట్టి నాకు సమస్యేం లేదు! ఈ ఇల్లు నా పేరు మీదే ఉండాలని తమ్ముళ్ళు అన్నా నేనెందుకు కాదన్నానో తెలుసా? వీళ్ళు సంక్రాంతి పండుగకి ఓ నాలుగైదు రోజులు, పిల్లలు వేసవి సెలవుల్లో పది పదిహేను రోజులు వచ్చి ఉంటారిక్కడ. ఎప్పుడూ ఉండేది నేనేగా. పుట్టి పెరిగిన ఊరుకి, ఇంటికి అప్పుడప్పుడు అయినా వెళ్ళి రావటంలో ఎంత ఆనందం ఉంటుందో నాకు తెలుసు! అన్నయ్య ఇంటికి వెళ్తున్నామనే మొహమాటం తమ్ముళ్ళకి ఎప్పుడైనా కలుగుతుందేమోననే అనుమానంతో, అలా కాకుండా... మన ఇంటికి వెళ్తున్నామనే స్వతంత్రంతో వాళ్ళు వచ్చి వెళ్తూండాలని ఇల్లు ఏ ఒక్కరి పేరు మీదగానో లేకుండా మా తరం ఉన్నంతవరకూ ఉమ్మడి ఆస్తిగానే ఉండి పోవాలని అనుకున్నాను!

అన్నదమ్ములందరం ఒక కుటుంబంలోని వాళ్ళమేగానీ ఆడవాళ్ళందరూ వేరు వేరు కుటుంబాల నుండి వచ్చిన వాళ్ళే కదా! ఆర్థిక సంబంధమైన అపోహలేవీ తలెత్తకుండా ఉండాలంటే అన్నివిషయాలూ అందరి మధ్య తేటతెల్లంగా ఉండాలనేది నా సిద్ధాంతం! అందుకే ప్రతి సంవత్సరం వాళ్ళు అడగకపోయినా సరే నేనే రాబడి, ఖర్చులు అన్నీ వివరంగా చెప్పేస్తాను. సంబంధ బాంధవ్యాలు సజావుగా సాగటానికి ఇటువంటి జాగ్రత్తలు తప్పనిసరి! ఒక్కోసారి మనం జాగ్రత్తగా ఉన్నా... ఎదుటి వాళ్ళలో సామరస్యం లేక చేయిదాటి పోయే పరిస్థితి ఎదురవుతుంది. అది వేరే సంగతి అనుకో!''

పట్టాభి మాటల్ని ఆశ్చర్యంగా వింటూండిపోయాను. మళ్ళీ చిరునవ్వుతో చూసి ''నీకో సంగతి చెప్పనా...?'' అన్నాడు. ''నువ్వు... నేనేదో త్యాగం చేశానని అంటున్నావుగానీ నిజం చెప్పాలంటే నాది స్వార్థమే! అవును! అన్నయ్య మా కోసం ఎంతో శ్రమ పడ్డాడనే భావంతో తమ్ముళ్ళ మనసులో స్థిరపడిపోయిన మమకారపు పద్దును, డబ్బు లెక్కలు కట్టి రద్దు చేసు కోవటం నీకిష్టం లేక పోయింది... ఇదీ సంగతి!'' అంటూ మళ్ళీ నవ్వాడు.

''బావుంది.... నీ సంగతి నాకు మాత్రం వింతగానే ఉంది!'' అంటూ నేను నవ్వాను.

అలా కబుర్ల మధ్య ఎప్పుడు కళ్ళు మూసుకున్నామో మాకే తెలియదు! కాసేపటికే తెల్లారిపోయింది.

పెళ్ళికూతుర్ని పెళ్ళివారితో పంపించటానికి అన్నీ సిద్ధం చేస్తున్న సమయంలో అనుకోని విధంగా పట్టాభికి ఒక సమస్య వచ్చి పడింది.

పట్టాభి కూతురు పేర తనవాటాకి వచ్చిన పొలంలో సగం రాసి ఇచ్చాడు. పెళ్ళయ్యాక పిల్లని పంపేటప్పుడు మూడు లక్షల నగదూ ఇస్తానని చెప్పాడు.. కొత్తకాపురానికి కావలసినవి కొనుక్కోవటానికి ఉపయోగపడుతుందని పొరుగూరిలోని రైతు పట్టాభి దగ్గర తీసుకున్న బాకీబాపతు డబ్బు మూడు లక్షలు పెళ్ళిరోజుకి తప్పకుండా జమ చేస్తానని మాట ఇచ్చాడు.

పట్టాభి ఈ మధ్యనే లీజుకు తీసుకున్న రైసుమిల్లులో కొత్తగా ఓ గుమస్తాని పెట్టాడు. ఆ గుమస్తానే డబ్బు కోసం పంపించాడు. సాయంకాలమే డబ్బు అతని చేతికిచ్చానని ఆ రైతు ఫోనుచేసి చెప్పాడు గానీ గుమస్తా రాలేదు. ఏ కారణం వలనో ఎక్కడో ఆగాల్సి వచ్చిందేమో ఏ సమయం లోనైనా వచ్చేస్తాడని పట్టాభి ఎదురు చూస్తుంటే... ఆ గుమస్తా హైదరాబాద్ వెళ్ళే రైలు ఎక్కటం చూశామనే కబురు ఎవరో పట్టాభికి చల్లగా చెప్పారు. ఆ గుమస్తా డబ్బుతో పరారయ్యాడని అర్థమై... ఎక్కడివాడో, ఎటువంటివాడో తెలియకుండా పనిలో పెట్టుకున్నందుకు శాస్తి జరిగిందని పట్టాభి బాధ పడిపోతున్నాడు. పెళ్ళి వాళ్ళకీ మాట ఎలాచెప్పాలీ, ఏం చేయాలీ అని సతమతమవుతుంటే నేనే పరిష్కార మార్గం చూస్తానని చెప్పాను.

పట్టాభి తమ్ముళ్ళిద్దర్నీ పిలిచి ఇదంతా వివరించాను. నాకు తోచిన పరిష్కారాన్నీ చెప్పాను. ''అయినవాళ్ళ దగ్గిర, ఆప్తుల దగ్గిర డబ్బు అప్పు తీసుకోకూడదనే నియమం పట్టాభికి ఉందని నాకు తెలుసు. మీకూ తెలిసే ఉంటుంది! డబ్బు తిరిగి ఇవ్వటంలో ఆలస్యం జరగొచ్చు... ఇవ్వలేకపోవచ్చు... ఇవ్వాలని అనిపించకపోవటమూ జరగొచ్చు అని పట్టాభి అంటూంటాడు. అందుకని మీ దగ్గిర, నా దగ్గిర తీసుకోక పోవచ్చు. ఆ పైన మీరు కూడా లోన్లు తీసుకుని ఇళ్ళు కొనుక్కున్నారు. ఈ పరిస్థితుల్లో సర్దుబాటు చేయటం మీకు కొంచెం కష్టమౌతుందని నాకు తెలుసు. ఇచ్చినా..... ఇప్పటివరకూ ఏ పొరపచ్చాలు లేకుండా ఉన్న మీ మధ్య ముందుముందు అనవసరంగా అపార్థాలు ఏర్పడే ప్రమాదమూ పొంచి ఉంటుంది. ఎవరికీ ఏ ఇబ్బంది లేకుండా నేను పెళ్ళి కొడుకు తల్లిదండ్రులకు ఒకమాట చెబుతాను. ఈ సమయంలో డబ్బు సమకూర లేదని చెబితే కట్టుకథ చెబుతున్నట్లుగా వీళ్ళకి అనిపిస్తుంది. తర్వాత ఇస్తామని అంటే అసలు ఇవ్వమేమోననే అనుమానం కలగొచ్చు. అందుకని డబ్బు సమకూర్చి ఇచ్చాకనే అమ్మాయిని కాపురానికి తీసుకెళ్ళ మని అడుగుతాను. వాళ్ళకి అనుమానం లేకుండా ఉంటుంది''.

ఒక నిముషం ఆగి ''విడిదింటికి వెళ్ళి నేనే ఈ మాట చెప్పి రానా... మీరూ నాతో వస్తారా?'' అడిగాను. ''కాసేపు ఉండండి..'' అంటూ ఇద్దరూ లోపలికి వెళ్ళిపోయారు.

ఏముందీ... ఇద్దరూ వాళ్ళశ్రీమతులతో ఈ విషయం చెప్పి ఏం చేయాలని సలహా అడుగుతారు. 'అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలని పెద్దలూ చెప్పారు. బాబాయ్ కూడా అదే అన్నారు గనుక అలాగే చేయండి' అంటూ వీళ్ళు నా సలహాకే ఓటు వేస్తారని నాకు తెలుసు!

కానీ చిత్రంగా నా అంచనాని తల్లక్రిందులు చేస్తూ పది నిముషాల్లోనే నా చేతుల్లోకి మూడు లక్షలు కాదు.... అక్షరాలా ఆరు లక్షల నగదు, చెక్కుల రూపంలో వచ్చి పడ్డాయి! లక్ష్మణ్, భరత్ ఇద్దరూ కూడా ఒకరి తర్వాత ఒకరువచ్చి డబ్బు ఇచ్చి ఒకే రకంగా మాట్లాడటంతో నాకు తల తిరిగింది!

వాళ్ళు చెప్పింది ఇది. ''అన్నయ్య ఇప్పటివరకూ అన్నీ మాకివ్వటమే గానీ మా దగ్గర్నుండి ఏమీ తీసుకోలేదు. అది అన్నయ్య గొప్పతనమే కానీ మాకు మాత్రం చిన్నతనంగా ఉంటుంది. ఇప్పుడిలా ఇవ్వగల అవకాశం దొరకటమే ఆనందం. ముందు ముందు అపార్థాలు కలుగుతాయోమోననే భయం మాకస్సలులేదు... అన్న తిరిగి ఇవ్వాలనీ గానీ.. ఇవ్వలేడేమోనని మేం అనుకుంటే కదా! అన్న ఒప్పుకోడని చెప్పలేదు గానీ మా ఇద్దరి వాటాల్లోని చెరి ఒక ఎకరం వకుళ, చిన్నాలకి ఇవ్వాలని మేం నిర్ణయించుకున్నాం. వకుళ అన్నకూతురే కాదు... మా అందరి అమ్మాయి. ఇది మా ఇంట్లో ఘనంగా, ఆనందంగా జరుగుతున్న మొదటి శుభ కార్యం. ఏ లోటూ ఉండకూడదు. ఇప్పటికిప్పుడు డబ్బు సమకూర్చి ఇచ్చాకే అమ్మాయిని కాపురానికి తీసుకెళ్ళమని వాళ్ళకి చెప్పటం... అన్నకే కాదు, మాకూ అది అవమానమే!

మా జీతాల్లో హెచ్చుభాగం ఇంటిలోనుకే సరిపోతున్న మాట నిజమే అయినా మేం ఉద్యోగాల్లో చేరిన



## మంచి భర్త కోసం మమత కలలు...

గాయనీగా సినీ రంగ ప్రవేశం చేసి, ఆ తరువాత హీరోయిన్‌గా సెటిల్ అవుదామని తెగ కలలు కన్న మమతా మోహన్‌దాస్ కలలు చివరికి కల్లలే అయ్యాయి. ఇటు టాలీవుడ్, అటు కోలీవుడ్, చివరకి మాలీవుడ్ కూడా మమతను అంగీకరించక పోవడంతో నటిగా తట్టా బుట్టా సర్దేసుకున్న సంగతి తెలిసిందే! అయితే పరిశ్రమ మీద ఉన్న ప్రేమ చావక తిరిగి సింగర్‌గా అవతారమెత్తాలన్న ఆలోచనలో సంగీత దర్శకుడు దేవీశ్రీప్రసాద్‌కు దగ్గరయింది. ఇక్కడా మమతకు చుక్కెదురయింది. చార్మి శాపనార్థాలు ఫలించి దేవిశ్రీకి, మమతాకు చెడిందన్న పుకార్లు జోరందుకున్నాయి. ఇక సినీ పరిశ్రమ తనకు అచ్చిరాదని నిర్ణయించుకొని చివరికి ఇల్లాలి పోస్టులో పర్మినెంట్‌గా సెటిల్ అయిపోవాలని గట్టిగా అనుకుంటోంది. అయితే భర్తగా ఉండడానికి బయట వ్యక్తుల కన్నా సినీ పరిశ్రమలోని వాడైతే మంచిదని మమత భావిస్తోందట! ఈ మేరకు ఓ కుర్ర హీరోను లైన్లో పెట్టినట్లు సమాచారం! అటు వైపు నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే ఇల్లాలిగా సెటిలైపోతుందట!

ప్పటి నుండీ వకుళ పెళ్ళికోసమూ విడిగా పెడుతున్నాం. అదేకాదు, ఎంత అవసరమైనా అప్పుతీసుకుని తీర్చ గలమనే ధీమా ఉంది! పెళ్ళి అవసరాల్లో పనికి వస్తుందని మేం తెచ్చిన డబ్బు... అన్న అభ్యంతరం చెబితే... వకుళకి ఏ రూపంగా కానుకగా ఇవ్వాలో ఆఖరున వదినతో సంప్రదించి నిర్ణయించవచ్చని అనుకున్నాం. ఇప్పుడు అవసరం ఇలా వచ్చింది. వకుళ, చిన్నా ఇద్దరూ మా పిల్లలే అనుకుంటున్నప్పుడు... వాళ్ళకేమైనా ఇవ్వవద్దనే హక్కు అన్నకీ లేదు. అన్నకి ఏం చెప్పి ఒప్పించి ఎలా చేస్తారో గానీ... డబ్బు అందలేదనే మాట బయటకు రాకుండా సవ్యంగా జరిగిపోవాలి!''.

వాళ్ళిద్దరూ తప్పించుకోవాలనుకోవటం లేదు... ఏమైనా చేయాలనే తపిస్తున్నారు!

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలనే మాటతో ఏకీభవించి గట్టిగా నమ్మే నాకు వాళ్ళిద్దరి ప్రవర్తనతో కనువిప్పు కలిగింది. ఆ మాటకి మినహాయింపుగా ఇలాంటి కుటుంబాలూ ఉన్నాయి!

''మీరందరూ ఇక్కడ సమావేశమయ్యారా...?'' అంటూ మేం కూర్చున్న గదిలోకి పట్టాభి వచ్చాడు.

''మీ గుమస్తా జగ్గారావు వచ్చి నువ్వు నిద్రపోవటం చూసి... నీ కిమ్మని ఈ డబ్బు ఇచ్చి ఇంటికివెళ్ళాడు. కాసేపట్లో వస్తానన్నాడు. సాయంకాలం దారిలో బండి ఆగిపోతే... రిపేరు చేయించే మార్గం లేక నానా తంటాలు పడి తెల్లవారు ఝూముకి ఎలాగో చేరగలిగానని చెప్పాడు..'' అంటూ నా జిప్ బాగ్‌లో ఉంచిన డబ్బును పట్టాభి చేతుల్లో పెట్టాను.

లక్ష్మణ్, భరత్‌లిద్దరూ షాక్ తగిలినట్టుగా నా వేపు చూశారు!

అప్పుడు పట్టాభికీ నేను ప్లే చేసిన ట్రిక్ గురించి వివరించాను.

''నువ్వు జగ్గారావు తీసుకువచ్చే డబ్బుకోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నావని నాకు తెలుసుకదా, అతను తెచ్చి ఇచ్చినప్పుడు.... వీళ్ళు చూడలేదుగా, అందుకని సరదాకి అలా చెప్పాను. వీళ్ళు గనుక పెళ్ళివాళ్ళతో అలాగే చెప్పి వద్దామని అంటే అప్పుడు... 'అంతలోనే జగ్గారావు వచ్చాడు... సమస్యలేదని' చెబుదామని అనుకున్నాను.'' అంటూ పట్టాభి చేయి పట్టుకుని ''మీ అమ్మా నాన్నలు ఏ ఉద్దేశ్యంతో ఈ పేర్లు మీకు పెట్టారోగానీ పట్టాభిరాముడూ.... నీ తమ్ముళ్ళు నిజంగా లక్ష్మణుడూ, భరతుడూ అంతటి వాళ్ళేరా...'' ఆనందంగా అన్నాను.

వకుళ, చిన్నాలు ఎప్పుడు ఏ పనిమీద ఆ గదిలోకి వచ్చారో మేం గమనించలేదు గానీ మా మాటలన్నీ వీళ్ళు విన్నట్లున్నారు... వకుళ విసురుగా నా దగ్గరికొచ్చి సీరియస్‌గా ''మీ ఉద్దేశ్యం ఏంటి బాబాయ్... మీరలా చెబితే వాళ్ళు సరే అంటారనుకున్నారా...?'' అంది.

''ఏం... ఎందుకనగూడదూ.... వాళ్ళగురించి నీకప్పుడే ఏం తెలుస్తుందీ..?'' అన్నాను.

''అయితే మీతో నేను పందెం కాస్తున్నాను. విశాల్ అస్సలు అలాంటి షరతును ఒప్పుకోడు. నన్ను కాపురానికి తీసుకెళ్ళటం డబ్బుతో ముడి పెట్టడు... కావాలంటే వెళ్ళి చెప్పి చూడండి'' అంది. అంతేకాదు.. అలా చెప్పాల్సిందే అంటూ ఒత్తిడి చేసింది. బాగుండదని విన్నా వినలేదు. పట్టాభి కూడా నవ్వుతూ చూస్తుంటే సరే చూద్దామని విడిదింటికి... పక్కనే కదా... వెళ్ళాను.

విశాల్‌ని పిలిచి... మెల్లగా చెప్పాలనుకున్నది చెప్పి నా వెంట బెట్టుకుని వచ్చి పట్టాభితో ''అబ్బాయికి చెప్పాను. సరే అన్నాడు. గడువిచ్చారు కదాని నువ్వు తాత్సారం చేయకు. వీలైనంత తొందరగా డబ్బు సమకూర్చుకుని అమ్మాయిని కాపురానికి పంపించెయ్యాలి'' అన్నాను.

అతను కొంచెం కంగారుగా ''అరె... నేను సరే నని... ఎప్పుడు అన్నానండీ?'' అన్నాడు.

''మౌనం అంగీకారమని నేను అనుకున్నాను. అయితే... ఇప్పుడే ఎలాగో తంటాలుపడి... సర్దుబాటు చెయ్యాలని అంటావా బాబూ...'' అడిగాను.

అతను మరింత కంగారు పడిపోయాడు. ''అబ్బే... నా ఉద్దేశ్యం అది కాదండి... పెళ్ళి అయ్యాక... డబ్బుతో ముడిపెట్టి... వకుళను ఇక్కడ ఉంచే ప్రశ్నేలేదు! మామయ్యగారు వకుళకి ఇస్తామని అన్నారు.. ఇవ్వటం, ఇవ్వలేక పోవటం అనేది వాళ్ళిద్దరికీ సంబంధించిన విషయం. ఇవ్వలేక పోయినా మాకేం అభ్యంతరం ఉండదు. మీరు దాని గురించి ఏం ఆలోచించకండి''.

అదే ఖచ్చితమన్నట్లుగా విశాల్ చెప్పిన మాటలకు నేను నిజంగా ముచ్చట పడ్డాను! వెంటనే వకుళ వేపు చూశాను.

అమ్మో... ఆ మొహంలో ఎంత వెలుగో..! మా ఆయన సంగతి ఇప్పుడైనా తెలిసిందా అన్నట్లుగా ఆ చూపుల్లో ఎంత బడాయో...!

పట్టాభి విశాల్ చేయిపట్టుకుని అనునయంగా అన్నాడు. ''మా వాడికి చిన్నప్పుడు నాటకాల పిచ్చి ఉండేది. అది ఇప్పటికీ పూర్తిగా అణగారి పోలేదు. అందుకే ఇలా మాలాంటి వాళ్ళ దగ్గరకు వచ్చినప్పుడు చిన్న చిన్న డ్రామా లేస్తుంటాడు... ఏమనుకోకు...''

విషయం తెలిసి విశాల్ కూడా సరదాగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. లక్ష్మణ్, భరత్ ఇద్దరూ అతనితో పాటు వెళ్ళారు.

''పెళ్ళయి ఒక రోజున్నా గడవ లేదు. అతని గురించి నీకేం తెలుసని అంత భరోసాగా ఛాలెంజ్ చేశావే అమ్మాయి..? పెద్దవాళ్ళకంటే కుర్రాళ్ళే డబ్బు గురించి పట్టుబట్టే వాళ్ళు ఎంతమంది లేరూ..?'' వకుళని అడిగాను.

వకుళ నవ్వేసింది గానీ చిన్నా సమాధానం చెప్పాడు. ''బాబాయ్.... పెళ్ళయి ఒకరోజున్నా గడవ లేదు గానీ... నిశ్చితార్థం జరిగి మూడు నెలలయిందిగా! మూడుజన్మల తర్వాత మళ్ళీ ఇప్పుడే కలుసుకున్నట్టూ... ఆ జన్మల ముచ్చట్లన్నీ పెళ్ళికి ముందే చెప్పేసుకోవాలన్నట్టూ రోజుకి పన్నెండు గంటల చొప్పున కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళకి... ఒకరికి గురించి ఒకరికి ఎందుకు తెలియదూ?''

''అన్ని గంటలు మాట్లాడుకుంటున్నారని నీకేం తెలుసురా?'' అన్నాను.

''అయ్యో బాబాయ్...'' అంటూ తలపట్టుకుని యాక్షన్ చేశాడు. ''సెల్ ఫోన్ బిల్ కట్టేది నేనేగా...!'' అన్నాడు. మళ్ళీ నవ్వుతూ ఇంకో మాట అన్నాడు. ''బాబాయ్... అక్క రోజూ ముచ్చట్ల ద్వారా బావ నరానరాల్లోకి ప్రేమని ఇంజెక్ట్ చేసేసింది! దాంతో బావకి వ్యాధి నిరోధక శక్తి బాగాపెరిగిపోయింది. డబ్బు జబ్బు ఎప్పటికీ సోకనే సోకదు...!''

వాడి తమాషా మాటలకి అందరం నవ్వాం.

పెళ్ళికూతురితో మగపెళ్ళివారు తరలి వెళ్ళగానే హడావుడి సద్దు మణిగింది.

కాసేపటి తర్వాత నేను ప్రయాణమై పట్టాభి దగ్గర వీడ్కోలు తీసుకుంటూ ''మీలాంటి కుటుంబాలు కొన్ని వున్నా సరే, ఊరంతా కూడా పచ్చగా, పాలవెల్లిలా కళకళలాడిపోతుంది.. నిజం!'' ఆనందంగా అన్నాను.

ఏ విషయమైనా తేటతెల్లంగా ఉంటే కొన్ని సమస్యలు తలెత్తక పోవచ్చు. మా అన్నదమ్ముల మధ్య సమస్యలకి నా పొరపాటు కొంత ఉందని అప్పుడు అనిపించింది.

✻

